# నాన్నా.. తొందరగా ఇంటికి రావూ!

-బి.వి. శివప్రసాద్

"నాన్నా సాయంత్రం పార్కుకి తీసుకువెళతావా?" ఆరేళ్ళ 'బబ్లూ' అడిగాడు రాహుల్‌ని.

"ఆదివారం తప్పకుండా వెళదాం బబ్లూ" అన్నాడు రాహుల్.

"చాలా రోజుల నుంచీ ఇలాగే అంటున్నావ్" దిగులుగా అన్నాడు వాడు.

"లేదు నాన్నా ఈసారి ఎలాగయినా తీసుకువెళతా" అనునయంగా అని ఆఫీస్‌కు బయలుదేరాడు రాహుల్.

అతను ఓ మల్టీ నేషనల్ బ్యాంక్‌లో జనరల్ మేనేజర్ (మార్కెటింగ్)గా పనిచేస్తున్నాడు. సంవత్సరానికి 7-8 లక్షల వరకూ జీతం రూపేణా అందుతుంది. అదీగాక ఇతర అలవెన్స్‌లు, బెనిఫిట్స్ బాగానే ఉంటాయి. మంచి ఇల్లు, కారు, అందమైన భార్య... అన్నీ ఉన్నాయి. 'ఇంజనీరింగ్' తర్వాత 'బజాజ్ ఇన్‌స్టిట్యూట్'లో ఎం.బి.ఏ. చేశాడు. కెరియర్‌లో తొందరగా ఎదిగి ప్రస్తుతం మంచి పొజిషన్‌లో ఉన్నాడు. జీవితం సుఖమయంగా గడప డానికి కావలసినవన్నీ ఉన్నాయి కానీ, పర్సనల్ టైమ్ అనేది మాత్రం తనకు, తన కుటుంబానికి తగినంత ఉండటంలేదు.

'బబ్లూ' పుట్టిన తర్వాత కొంత కాలం వరకూ తనూ, భార్య దీప్తి హ్యాపీగానే ఉన్నారు. కానీ వాడు పెరుగుతున్న కొద్దీ వాడితో తను గడిపే సమయం బాగా తక్కువై పోయింది. అతనికి బాబుతో రోజూ ఆడుకోవాలని, వాడిని బయటకు తీసుకువెళ్లి సినిమాలు చూపించాలని, సరదాలు తీర్చాలని అనిపిస్తుంది. కానీ అంత టైమ్ దొరకడంలేదు. పని ఒత్తిడి బాగా ఎక్కువైంది. తను ఎఫిషియంట్ అండ్ సిన్సియర్ కావడంతో మేనేజ్‌మెంట్ నుంచి ఎక్స్‌పెక్టేషన్స్ ఎక్కువగా ఉన్నాయి. మార్కెట్లో కాంపిటీషన్ తట్టుకోవాలంటే అడుగడుగునా అప్రమత్తంగా ఉండాలి. ఏమాత్రం ఈజీగా తీసుకోకూడదు. తమ బ్యాంక్ లోగడ మంచి లాభాల బాటలోనే నడిచినా, ఈ మధ్య ఆశించినంత రిజల్ట్స్ రావడంలేదు. 'గ్లోబలైజేషన్' తర్వాత మార్కెట్ బాగా ఓపెన్ అయ్యి పోటీ విపరీతంగా పెరిగింది. బ్యాంకింగ్ రంగంలో లభించే సేవలు విస్తృతమయ్యాయి (వెహికల్ ఫైనాన్స్, హోమ్‌లోన్స్, ఇన్సూరెన్స్, కన్స్యూమర్ లోన్స్, పర్సనల్ లోన్స్, ఇంకా ఎన్నెన్నో...) దాదాపు అన్ని బహుళజాతి కంపెనీలు తమ పరిధిని విస్తరించుకుని కాంపిటీషన్‌ని విపరీతంగా పెంచేశాయి. ఎక్కడ చూసినా నిరంతర పోటీ. అందుమూలంగా ఉద్యోగులపై తీవ్రమయిన ఒత్తిడి. కన్స్యూమరిజం బాగా పెరిగిపోయింది. ప్రపంచీకరణ, ఆర్థిక సరళీకృత విధానాల వల్ల నిజంగా లబ్ధిపొందుతున్నదెవరు? విదేశీ వాణిజ్య దళారులా? మన ప్రభుత్వమా? లేదా ఈ జగన్నాటకంలో పాత్రలు, పావులుగా మారిపోయిన తనలాంటి ప్రజలా? ఎవరు? గత కొన్ని రోజులుగా తను ఆలోచిస్తున్నాడు.

'దీప్తి' కూడా 'ఇండివిడ్యుయాలిటీ' ఉన్న వ్యక్తి కావడం వల్ల తను ఖాళీగా ఇంట్లో కూర్చోవడాని కిష్టపడలేదు. ఆమె మాథమాటిక్స్‌లో ఎమ్.ఫిల్. చేసింది. రెండు సంవత్సరాల నుంచి ఓ కార్పొరేట్ విద్యా సంస్థలో 'ఎంసెట్' విద్యార్థులకు 'మ్యాథ్స్' టీచ్ చేస్తోంది. ఆమెలో మంచి ప్రతిభ, టీచింగ్ క్వాలిటీస్ ఉండటం వల్ల 'మేనేజ్‌మెంట్' బాగానే ముట్టజెప్తోంది. కానీ దానికి మించిన పనిని ఆమె దగ్గర్నుంచి రాబట్టుకుంటోంది. ఇంట్లో ఆమె తల్లి సహాయం ఉండడంతో 'బబ్లూ' బాధ్యత ఎక్కువగా లేదు. కానీ ఆమె పని కూడా మెకానికల్‌గా తయారయింది. ఎంతసేపూ ర్యాంకుల గోల, టీచింగ్, కోచింగ్. పిల్లలకు మంచి ర్యాంకు వచ్చేవిధంగా కౌన్సెలింగ్ చేయడం. వీటిచుట్టూ ఆమె వృత్తి జీవితం తిరుగాడుతోంది. తనకూ, రాహుల్‌కూ మధ్య వాళ్లిద్దరూ ప్రశాంతంగా గడిపే సమయం ఉండటంలేదు. ఇక బబ్లూ సంగతి సరేసరి.

"దీప్తీ.. నువ్వు సంతోషంగానే ఉన్నావా?" ఒకరోజు రాత్రి అడిగాడు రాహుల్.

"హ్యాపీగానే అనిపిస్తోంది. కానీ ఏదో వెలితిగానూ, జీవితం మెకానికల్‌గానూ ఉంది" బదులిచ్చిందామె.

"బబ్లూ రోజూ చేసే గొడవ మీరు చూస్తూనే ఉన్నారుగా" అంది.

"అవును, నాకూ అలాగే ఉంది. అంతా బాగానే ఉన్నట్లుంది. అన్నీ ఉన్నట్లే ఉన్నాయి. కానీ ఉండాల్సి నంత 'క్వాలిటీ' మన జీవితాల్లో లేదనిపిస్తోంది" అన్నాడతను.

"ఈ మధ్య బబ్లూను చూస్తుంటే ఆ విషయం మరీ స్పష్టంగా తోస్తోంది. మనం సరదాగా బయటకెళ్లి, ఓ సినిమా చూసి, మంచి హోటల్లో భోంచేసి చాలా రోజులయినట్లుంది కదూ" అందామె.

"చాలా రోజులేంటి? దాదాపు తొమ్మిది నెలలయ్యింది" బదులిచ్చాడు రాహుల్.

అలా ఆ రాత్రి చాలా రోజుల తర్వాత మనసు విప్పి మాట్లాడుకున్నారు ఇద్దరూ.

నిజానికి రాహుల్ భావుకుడు, మంచి అభిరుచి ఉన్నవాడు. మ్యూజిక్, లిటరేచర్ అంటే ప్రాణం. ఒకప్పుడు మంచి క్రికెట్ ప్లేయర్ కూడా. కానీ ఇప్పుడు? ఒక మంచి పుస్తకం చదివి, తనివితీరా సంగీతం విని కొన్ని యుగాలయినట్లుంది. ఇక క్రికెట్ అనే ఆట ఒకటుందని ఎప్పుడో మర్చిపోయాడు. ఈ మధ్యనే వార్తల్లో టీం ఇండియా శ్రీలంకపై టెస్ట్ మ్యాచ్ గెలిచినట్లు, అందులో తన అభిమాన బౌలర్ ఇషాంత్ శర్మ, హర్భజన్ సింగ్ ప్రముఖ పాత్ర వహించినట్లు చదివాడు. అసలు క్రికెట్ మ్యాచ్ స్టేడియంలో ప్రత్యక్షంగా చూడాలని తనకెప్పటినుంచో కోరిక. అది ఈ జన్మకు తీరేనా? ఏమో? ఆ భగవంతునికే తెలియాలి.

తనకు పిల్లలు పుడితే వాళ్లని ఏదో ఒక ఆటలో ప్రావీణ్యత పొందేలా చేయాలని తన చిరకాల వాంఛ. అవునూ, తను పిల్లలు అంటున్నాడేంటి? బబ్లూకి టైమ్ ఇవ్వడమే అతి కష్టంగా ఉన్న ఈ పరిస్థితుల్లో పిల్లల గురించి ఆలోచించే వ్యవధి, తీరిక ఉన్నాయా? ఏంటో ఈ మధ్య దీప్తితో రొమాంటిక్‌గా స్పెండ్ చేసి కూడా చాలా రోజులయ్యింది. ఇదేనా తాను కావాలనుకున్న జీవితం? అప్పుడప్పుడూ తనకి ఇలాంటి ఆలోచన లొస్తున్నాయి.

దీప్తి కూడా తన గురించి రాహుల్ గురించి ఆలోచిస్తూ ఉంది. ఆయనా రోజూ ఇంటికి లేట్‌గా వస్తున్నాడు. విపరీతమైన పని ఒత్తిడి. ఈ మధ్య తరచుగా డ్రింక్ చేసి వస్తున్నాడు. ఇదివరకెప్పుడూ లేంది స్మోకింగ్ కూడా మొదలుపెట్టాడు. ఓరోజు అడిగితే "నన్నర్థం

## పూల వాకిలి

ఇంద్ర ధనుస్సుని కత్తిరించి
మా వీధుల్లో అతికించినట్టు
దారెంటా రంగు రంగుల పూలపరిమళాలు!
బుడి బుడి నడకలతో దూరాల్ని చుడుతూ
కాంతిమయ లోకానికి బారులు తీరినట్టు
మోయక తప్పని బరువుల సంచితో
క్రమశిక్షణ చట్రంలోకి దూరుతున్నట్టు

❖ ❖ ❖

గంటల వెంట విషయాల బోధన
అర్థమై కొన్ని.. అర్థంగాక కొన్ని
తీరని అనుమానాల ఊయల కళ్ళముందు-
చుట్టూతా ఎన్ని వలలు.. ఎన్నెన్ని వయాలు...
సాలీడు గూటిలో చిక్కి
గింజుకుంటున్న ఈగల్లాగ-
అయిష్టతల అలారం మోగినప్పుడల్లా
కాలాన్ని మరింత త్వరగా మింగేయాలని...
కాసేపు రెక్కలు కట్టుకుని తనలోకంలోకి
ఎగిరిపోవాలని...
వాళ్ళ మనసుల్ని చదివిందెవరు?
వాళ్ళ ఆశల్ని... ఆకాంక్షల్ని రూపుకట్టించేదెవరు?
పూలకీ వెతలుంటాయి-
కన్నీటి కతలుంటాయి-
ఒకరి కోరికలకి...
ఇంకొకరి కోపాలకి నడుమ
నలుగుతూనే-
పరీక్షల రాట్నం వెంట చుట్టుకుపోలేక
పుటుక్కుమన్న దారప్పోగుల్లా...
ఆటమధ్య అలిసి రాలిన పూలబంతులెన్నో!
ఏ తోటలోని పూలైనా ఇక్కడ పరిమళించాలి-
నిజమే- సుకుమారంగా తెలివిగా అల్లితేనే
పూలు దండలై శోభిల్లుతాయి
లేకుంటే దండగైపోతాయి-
దారిచూపే రెండు చేతుల కోసం
వాళ్ళు దారులు వెతుకుతున్నారు-
మీ హృదయాల్ని తెరవండి
వాకిలి నిండా పూల సుగంధం!

-మోతుకూరి అశోక్‌కుమార్

చేసుకో దీప్తీ! టెన్షన్ భరించలేక అప్పుడప్పుడూ సిగరెట్ కాలుస్తున్నాను. అలా చేసినప్పుడల్లా కాస్త రిలీఫ్‌గా ఉన్నట్లనిపిస్తోంది. అందుకే.. నన్ను అర్థం చేసుకో" అన్నాడు.

ఉదయం ఏదో బ్రేక్‌ఫాస్ట్ హడావిడిగా చేసి వెళ్లిపోతాడు. మధ్యాహ్నం రోజూ భోజనం బయటే. ఏం తింటున్నావని ఈ మధ్య అడిగితే- పిజ్జా, బర్గర్, శాండ్‌విచ్ లేదా బిర్యానీ అంటున్నాడు. చికాకూ ఎక్కువయిందీమధ్య. బబ్లూని కూడా తరచుగా విసుక్కుంటున్నాడు. వాడి బాధ తను చూడలేకపోతోంది. కడుపులో, గొంతులో మంట అంటున్నాడు. బిపి ఎక్కువగా ఉందేమోనని తనకు అనుమానంగా ఉంది. ఈ వారమైనా జనరల్ చెకప్‌కి తీసుకెళ్లాలి. కుదురు తుందో, లేదో అనుకుంటూ ఉందామె.

దీప్తి పరిస్థితి కూడా అధ్వాన్నంగానే ఉంది. ఎంసెట్ డేట్ దగ్గర పడుతోందని, వాళ్ల ప్రిన్సిపల్ మీటింగ్ పెట్టాడు. ఈసారి తమ విద్యార్థులు అత్యున్నత ర్యాంకులు పొందేందుకు ఏం చేయాలో సూచించమని, అందుకు ఆమెనే ఇన్‌చార్జ్ చేసి తనకు డైలీ రిపోర్ట్ ఇవ్వమన్నాడు. స్టూడెంట్స్‌కు ఒక ఆటవిడుపు లేదు. ఎప్పుడూ రుద్దుడు, రుబ్బుడు. పైగా లెక్చరర్ల నిరంతర నిఘా. ఈ అతి ఒత్తిడి తట్టుకోలేక కొంతమంది ఆత్మహత్యకు కూడా తెగబడ్డారు. వారి వైఫల్యాలలో తన బాధ్యత ఎంత? వారు కేవలం ర్యాంకులు సాధించే షో పీసెస్‌గా మార్చ బడుతున్నారు. మంచి అభిరుచులు, వ్యాపకాలు లేవు. వ్యక్తిత్వ వికాసం పూర్తిగా శూన్యం.

ఈ కమర్షియల్ విషవలయంలో తానొక భాగస్వామిగా మారిపోయింది. విద్యా వ్యాపారాభివృద్ధికి తనవంతు చేయూతనిస్తోంది. విద్యాలయాలు వ్యాపార నిలయాలుగా మారిపోయాయి. ఇదేనా తాను నిజంగా చేయాలనుకుంది. టీచింగ్‌ను తానొక ఉన్నతమైన వృత్తిగా భావించి ఇందులోకి వచ్చింది. నిజంగా తాను వృత్తికి న్యాయం చేయగలుగుతోందా? తనకు తాను సంతోషంగా ఉందా? మరి దేనికోసం ఈ శ్రమ? ఇలా సాగుతున్నాయి ఆమె ఆలోచనలు.

ఒకరోజు రాత్రి పది గంటలకు ఇంటికి వచ్చాడు రాహుల్. అతను లోపలికి రాగానే బబ్లూ- "నాన్నా నువ్వు రోజుకు ఎంత సంపాదిస్తావ్?" అని ప్రశ్నించాడు.

అవాక్కయ్యాడు రాహుల్. "ఏరా, ఇది నువ్వు నన్ను అడగాల్సిన ప్రశ్నేనా?" కసురుకున్నాడు. అప్పటికి ఊరుకున్నాడు వాడు. ఆ మరుసటి రోజు రాత్రి పడుకో బోయే ముందు రాహుల్ పొట్టమీదకెక్కి కూర్చుని మళ్లీ అదే ప్రశ్న అడిగాడు. ఈసారి అతనికి కోపం రాలేదు. వాడి ముద్దు మొహంలోకి చూస్తే చాలా ప్రసన్నంగా అన్పించింది. సరే సమాధానం చెప్తే పోలా అను కున్నాడు.

"రెండు వేల రూపాయలు" అన్నాడు రాహుల్.

"అయితే నాకు 500 రూపాయలు ఇస్తావా?" అడిగాడు వాడు. మళ్లీ నిర్ఘాంతపోయాడతను. కానీ అనునయంగా "నీకెందుకు నాన్నా అంత డబ్బు? ఏదైనా డ్రెస్ కావాలా? బొమ్మ కొనిపెట్టమంటావా?" అడిగాడు రాహుల్.

"అందుకు కాదు నాన్నా, నా దగ్గర 500 రూపాయలు ఉన్నాయి. నువ్వు ఇంకో 500 ఇస్తే, నువ్వు, నేను, అమ్మ 'స్పైస్ ఇన్'లో డిన్నర్‌కి వెళ్లవచ్చు. మనం అలా వెళ్లి చాలా రోజులయ్యింది" అన్నాడు బబ్లూ.

ఈ సమాధానానికి రాహుల్‌కి ఎలా రియాక్ట్ అవ్వాలో తెలియలేదు. కానీ కొద్దిసేపయ్యాక అతనికి క్లారిటీ వచ్చింది.

"రోజూ తొందరగా ఇంటికిరా నాన్నా. నాకు నీతో ఆడుకోవాలనుంది. నువ్వు కథలు చెప్పాలి కూడా" అన్నాడు బబ్లూ.

"అలాగేరా తప్పకుండా వస్తాను" అన్నాడు రాహుల్.

ఇది జరిగిన తర్వాత ఆ ఆదివారమే తీరిక చేసుకుని, ఆఫీస్‌లో పని ఉన్నా, అది వేరే వాళ్లకి అప్పగించి దీప్తి, బబ్లూలతో గడిపాడు. సినిమాకు వెళ్లారు. కాసేపు పార్కులో గడిపారు. రాత్రి భోజనం హోటల్‌లో చేశారు. దీప్తి, బబ్లూ చాలా ఆనందంగా కన్పించారు. తనకు కూడా ఏదో కొత్త శక్తి వచ్చినట్లయింది.

ఆ రాత్రి బబ్లూ తొందరగా నిద్రపోయాడు. రాహుల్, దీప్తి మాటల్లో పడ్డారు.

"ఏదో ఒకటి చేయాలండి. మనకు, మన ఫ్యామిలీ కోసం రోజూ కొంత టైమ్ కేటాయించుకోవాలి" దృఢంగా అంది ఆమె.

"అలాగే తప్పకుండా చేయాలి. కానీ ఎలా?" ప్రశ్నించాడతను.

"ఈ ఎంసెట్ పూర్తవగానే నేను ఆ కార్పొరేట్ కాలేజీలో మానేస్తానండి. మన ఇంటికి దగ్గరలోనే సెయింట్ జాన్స్ అనే స్కూలు చెవిటి, మూగ పిల్లల కోసం నడుపుతున్నారు. అందులో పనిచేద్దామని నిర్ణ యించుకున్నాను" అంది.

"అలాగే, నేను కూడా వేరే ఏదైనా ఒత్తిడి తక్కువగా ఉండే ఉద్యోగానికో, లేదా కన్సల్టెన్సీ ప్రారంభించడం గురించో మెల్లిగా ఆలోచిస్తాను" అన్నాడతను.

ఎన్నో రాత్రుల తర్వాత రాహుల్, దీప్తి ప్రశాంతంగా నిద్రపోయారు. ■

# పెండ్లిచూపులు

**-డా॥ బి.దామోదరరావు**

"హలో హలో" వినిపిస్తుందా సార్. కరీంనగర్ నుంచి మాట్లాడుతున్నా..."

"ఆ.. ఆ.. వినిపిస్తోంది. చెప్పండి" అవతల నుంచి సమాధానం.

"మీ అబ్బాయి పెళ్ళికి ఉన్నాట్టగా! మాట్రి మోనియల్‌లో చూశాను సార్. అవునా?"

"ఆ.. ఆ.. ఉన్నాడండి. మీ గోత్రం" సంప్రదాయం పలికింది.

"అయ్యా మా గోత్రం కాశ్యప. మరి మీ గోత్రం..?" ఆత్రుత. అబ్బాయి ఎన్నారై మరి.

"భేష్. పరవాలేదు. మా గోత్రం భరద్వాజ. గోత్రాలు ఒక్కటి కాలేదు."

"హమ్మయ్య, మీ అబ్బాయి ఎక్కడ జాబ్ చేస్తున్నా డండీ?" కరీంనగర్ పక్షి.

"మావాడు న్యూయార్క్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో. మరి మీ అమ్మాయి ఏం చదువుతోంది?" సంప్రదాయం.

"మొన్ననే ఎం.సి.ఎ. పూర్తయింది. ప్రస్తుతం ఎంబ్రాయిడరీలో డిప్లొమో చేస్తోందండీ"

"ఓహ్.. అలాగా. బీటెక్ అనుకున్నా. అయినా కంప్యూటర్ స్కిల్స్ ఉంటాయిగా. సర్దుకుపోతాంలెండి.'

"అన్నట్టు అమ్మాయి వయస్సు, ఎత్తు చెబుతారా?" సంప్రదాయం ఆధునిక ప్రశ్న.

"మా అమ్మాయి వయస్సు ఇరవై రెండండి. ఎత్తు అయిదడుగుల అయిదంగుళాలు. మరీ మీ..."

"తెలుసు మీరడుగుతారని. మా అబ్బాయి వయస్సు ముప్పయ్ ఏళ్ళు. ఎత్తు ఆరడుగులు. సరిపోతాయా?"

"అవును రావుగారూ, మీ అమ్మాయి నక్షత్రం చెప్పలేదు. పాదాలతో సహా చెప్పండి. మా శాస్త్రిగారు అసలే ఒప్పుకోరు" సంప్రదాయం.

"అమ్మాయి నక్షత్రం అనురాధ, రెండో పాదమండీ. మరి మీ అబ్బాయి వివరాలు..."

"తప్పకుండా. ఆశ్లేష, మొదటి పాదమండీ"

"ఆహా కుదురుతుందని మా శాస్త్రిగారు చెబు తున్నారు."

"మీ అమ్మాయి ఫొటో పంపిస్తే మావాడు చూస్తాడు. అమ్మాయి రంగు.. తెలుపా, చామన ఛాయా? చెప్పండి" అధికార స్వరం వినిపిస్తుంది.

"మా అమ్మాయి బాగుంటుందండి. తెలుపు. మీ అబ్బాయి..."

"మావాడు అచ్చం నాలాగే తెల్లగా ఉంటాడండీ. మరి మీ అమ్మాయి సన్నగానా, లేక లావా? ఆహాఁ ఎందుకంటే ముందే తెలుసుకుంటే ఇబ్బంది ఉండదు కదా.. అందుకని" సంప్రదాయం.

"సార్, అమ్మాయి సన్నగా ఉంటుంది. మరి మీ బాబు?" ఆసక్తిగా అడిగాడు కరీంనగర్ పక్షి.

"మావాడు కొద్దిగా బొద్దులెండి. పైగా అమెరికా కదా, బర్గర్లు, పిజ్జాలు తింటారు కదా. మొత్తంమీద అన్నీ బాగానే కుదిరాయి. మరి మీరు హైదరాబాద్ ఎప్పుడొస్తారు? ఈ మాసంలో మూఢాలు పోయి, మంచి రోజులొచ్చాయి."

"వస్తామండి. మరి మీకు శాఖ పట్టింపులు.. అవీ..." ఆగాడు కరీంనగర్ పక్షి.

"లేవండి. మరి మీరు నియోగులా? వైదికులా?" సంప్రదాయం.

"నియోగులమండి. అయితే వైదికుల ఇంటికి మా పెద్దమ్మాయినిచ్చామండి"

"సరే.. సరే. రాసుంటే తప్పుతుందా! అన్నట్టు మీరు కరీంనగర్ వాళ్ళు కదా! తెలంగాణాపై మీ అభిప్రాయం ఏమిటీ?"

'అమ్మో, రాజకీయాభిప్రాయాలు కూడ పెండ్లిండ్లలో చోటుచేసుకున్నాయా?" అనుకుంటూ, కరీంనగర్ పక్షి కంగారుపడుతూ... "ఎంతైనా ప్రాంతీయాభిమానం తప్పక ఉండాలి కదండీ..."

అంతే ఫోన్ కట్. ■